క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, స్వామికి అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా పైడిమాంబ మారువారం పండగ



అన్నసమారాధనలో వడ్డన చేస్తున్న గ్రామపెద్దలు

పరవాడ: స్థానిక పైడిమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. పరవాడ పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, కూటమి నాయకుడు పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, బొద్దపు అయ్యబాబు పలువురు గ్రామ పెద్దలు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధన కార్యక్రమంలో భక్తులు పాల్గొని, అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం



గ్రామ పెద్దల సమక్షంలో విరాళం అందిస్తున్న ప్రసాద్

పరవాడ: స్థానిక పైడిమాంబ ఆలయ పునర్నిర్మాణానికి పరవాడ గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ(షిప్‌యార్డ్ ఉద్యోగి) కుమారుడు పైల ప్రసాద్ రూ.2 లక్షల విరాళాన్ని సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడుకు మంగళవారం అందించారు. ఈ మేరకు దాతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకుడు చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, పైల అప్పలనాయుడు, చీపురుపల్లి సన్యాసిరావు, పైల సురేష్ పాల్గొన్నారు.

బేడ, బుడగ జంగాలను గ్రూప్-ఏలో చేర్చడం హర్షణీయం



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు సత్యం

పరవాడ: బేడ, బుడగజంగం కులాలను ఎస్సీ వర్గీకరణలో గ్రూప్-ఏలో రెల్లి కులంతో పాటు చేర్చడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడం పట్ల ఆయా కులస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కుల ధ్రువీకరణ పత్రం పొందేందుకు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు ధూపం సత్యం, ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్‌లు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. సాధ్యమైనంత తొందరలో చట్టబద్ధత కల్పించి, వర్గీకరణ మేరకు కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాల్సిందిగా కోరారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

పెందుర్తి: జోన్–8 పరిధిలో మంచినీటి సరఫరా జరిగే కృష్ణాపురం హెడ్ వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌లో పంపుసెట్లు మరమ్మతులకు గురి కావడంతో బుధవారం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజినీరు కె.వీరయ్య తెలిపారు. 93వ వార్డు(భాగం) నుంచి 98వ వార్డుల పరిధిలో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణానగర్, వెంకటసాయినగర్, బంటాకాలనీ, రవినగర్, అప్పలనరసింహంకాలనీ, లక్ష్మీపురం, పోర్టుకాలనీ, రామ కోఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీ కాలనీ, గోకుల్ ధామ్ కాలనీ, రెల్లి వీధి, కృష్ణరాయపురం, గొల్లవిల్లివానిపాలెం, ఎల్‌ఐసీ కాలనీ, సుజాత నగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాతూరు, తెలకల వీధి, పెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంతం, ప్రశాంతినగర్, క్రాంతినగర్, వుడాకాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతినగర్, సావిత్రినగర్, అప్పన్నపాలెం, సింహపురిలేవుట్, అడవివరం ఎస్సీ కాలనీ, పాత అడవివరం తదితర ప్రాంతాల్లో మంచినీటి సరఫరా ఉండదన్నారు.



కూటమి ప్రభుత్వం వచ్చాక పరవాడ మండలంలో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. అక్రమార్కులు రెట్టించిన ఉత్సాహంతో గ్రావెల్ తవ్వేస్తున్నారు. కళ్ల ముందే చెరువులు, కొండలు, గుట్టలు కొల్లగొడుతున్నా మైన్స్, రెవెన్యూ అధికారులకు మాత్రం పట్టట్లేదు. ఫిర్యాదులున్నా పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి నేతల ఒత్తిళ్లతో 'మామూళ్ల'గా మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

- పరవాడలో యథేచ్ఛగా గ్రావెల్ దందా
- కూటమి ప్రభుత్వంలో అక్రమార్కుల బరితెగింపు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

అర్ధరాత్రుళ్లు తవ్వకాలు

పెదముషిడివాడ దరి విజయరాంపురం కొత్త చెరువు, తుమ్మల చెరువుతో పాటు సర్వే నెం.367, 408, 409, 323లలోని కొండల్ని రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల మధ్యలో భారీ యంత్రాలతో కొల్లగొడుతున్నారు. గెడ్డలు, వాగులను కూడా వదలట్లేదు. కొండలు, చెరువుల్లో తవ్వకాలు జరిపిన గ్రావెల్, మట్టిని భారీ వాహనాలతో గాజువాక, అగనంపూడి, లంకెలపాలెం, ఫార్మాసిటీ ప్రాంతాలకు తరలించి టిప్పర్ రూ.7 వేలు నుంచి రూ.7,500 వరకు విక్రయించి రూ.లక్షల్లో వెనుకేసుకుంటున్నారు. ముందుగా ఆయా ప్రాంతాల్లో భవన నిర్మాణ యజమానులతో ఒప్పందం కుదుర్చుకొని గ్రావెల్‌ను తరలిస్తున్నారు. భవన పునాదుల ఫిల్లింగ్, రియల్ ఎస్టేట్ వెంచర్లలో రహదారులు, లోతట్టు ప్రాంత ఫిల్లింగ్ కోసం ఇక్కడి గ్రావెల్, మట్టిని యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు.



పెదముషిడివాడ తుమ్మల చెరువులో అక్రమార్కులు తవ్వుకుపోయిన గ్రావెల్

తవ్వుకున్నోడికి.. తవ్వుకున్నంత!

పరవాడ:

మండలంలోని పెదముషిడివాడ, ఇ.బోనంగి, దేశపాత్రునిపాలెం, తాడి ప్రాంతాల్లో గ్రావెల్ దందా యథేచ్ఛగా సాగుతోంది. మైన్స్, రెవెన్యూ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రావెల్ దొంగలు మరింతగా రెచ్చిపోతున్నారు. ప్రస్తుతం మండలంలో గ్రావెల్ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. ముఖ్యంగా పెదముషిడివాడ ఏరియాలో కొండలు, గుట్టలు, చెరువులు, గెడ్డలు ఇలా ఎక్కడ పడితే అక్కడ గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. గ్రావెల్ దొంగలు 'కూటమి'గా ఏర్పడి, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదు.

కళ్లకు కరెన్సీ గంతలు

ఈ ప్రాంతంలో ప్రతి నిత్యం గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నా.. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కన్నెత్తి చూసిన పాపాన పోవట్లేదు. ఇందుకు ముడుపులే కారణమన్న ఆరోపణలున్నాయి. ఈ బోనంగి సర్వే నెం.11లోని కొండను తవ్వి పరవాడ, దేశపాత్రునిపాలెం, వాడచీపురుపల్లి, పి.బోనంగి, ముత్యాలమ్మపాలెం ప్రాంతాల్లో నిర్మిస్తున్న భవన పునాదుల ఫిల్లింగ్‌కు తరలిస్తున్నారు. తాడి క్వారీలో ప్రభుత్వ అనుమతులను అతిక్రమించి మరీ తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు చెప్తున్నారు. నాయుడుపాలెం, వాడచీపురుపల్లి ప్రాంతాల్లోని చెరువుల్లో స్థానిక రెవెన్యూ సిబ్బంది అండదండలతోనే గ్రావెల్ అక్రమ తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నట్లు ఆరోపిస్తున్నారు. మండలంలో దర్జాగా సాగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలను అరికట్టే దిశగా మైనింగ్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం



పెదముషిడివాడ, ఈ బోనంగి ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలను నిరోధించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులతో మాకు ఎలాంటి సంబంధాల్లేవు. ప్రభుత్వ స్థలాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జరుపుతూ పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవు. రాత్రి సమయంలో ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహించేలా రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తాం.

– ఎస్వీ అంబేడ్కర్, తహసీల్దార్, పరవాడ

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన



పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి ఎస్ వరలక్ష్మి

సింహాచలం:

లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు ప్రతీ విద్యార్థి కృషి చేయాలని జస్టిస్ ఎస్.వరలక్ష్మి తెలిపారు. అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులకు విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై మంగళవారం అవగాహన కల్పించారు. న్యాయమూర్తి జస్టిస్ వరలక్ష్మి విద్యార్థులకు పోక్సో చట్టంలోని పలు అంశాలను వివరించారు. న్యాయ సేవాధికార సంస్థ చేసే న్యాయ సహాయం గురించి తెలిపారు. బాలలపై అఘాయిత్యాలను నిరోధించేందుకు పోక్సోచట్టం ఏర్పడిందన్నారు. ఈ చట్టం క్రింద నేరానికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. పిల్లలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. ఎవరైనా తమ పట్ల తప్పుగా ప్రవర్తిస్తున్నారని అనుమానం వస్తే వెంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. ఫేక్ స్నేహాలను నమ్మొద్దని హితవు పలికారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ ఎస్‌ఐ అప్పలనాయుడు మాట్లాడుతూ బాలలపై ఎలాంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయో తెలిపారు. పోక్సో చట్టం క్రింద నమోదవుతున్న కేసులు, శిక్షలను వివరించారు. విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ బాలలకు తల్లిదండ్రులే అసలైన స్నేహితులను తెలియజేశారు. అన్ని విషయాలను వారితో పంచుకోవాలని సూచించారు. స్నేహం పేరుతో దగ్గరయ్యే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రతపై ప్రత్యేక శ్రద్ధ



బహుమతులు అందుకున్న విద్యార్థులతో జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి


పరవాడ: భద్రత చైతన్యాన్ని పెంపొందించడంలో జాతీయ భద్రతా వారోత్సవాలు ప్రముఖ పాత్ర పోషించాయని జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్‌రెడ్డి అన్నారు. జేఎన్‌పీసీలోని ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమలో మంగళవారం నిర్వహించిన 54వ జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పరిశ్రమ యాజమాన్యాలు భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమలో ఈహెచ్ఎస్ విభాగం ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ప్రసంగం, క్విజ్, డ్రాయింగ్ పోటీలతో పాటు భద్రత నినాదాలు, రంగోళి పోటీలను నిర్వహించారు. పరవాడ పాఠశాల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు జరిపి, విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ ఇండియా పరిశ్రమ చైర్మన్, ఎండీ కుమరేశన్ రాజేంద్రన్, పరిశ్రమ మేనేజర్ పాండవ ప్రసాద్, ఉద్యోగులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవం.. అమ్మవార్ల ఉత్సవం



ముత్యమాంబను దర్శించుకుంటున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

పరవాడ: వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, భర్నికం గ్రామాల ప్రజలు ఆరాధ్యదైవంగా కొలిచే ముత్యమాంబ, పరదేశిమాంబ అమ్మవార్ల పండగ మహోత్సవాలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. వేకువ జాము నుంచే భక్తులు గ్రామ దేవతలను దర్శించుకునేందుకు బారులు తీరారు. పసుపు కుంకుమలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని ఆలయ ఉత్సవ కమిటీ ప్రతినిధులు మాజీ సర్పంచ్ కూండ్రపు సన్యాసినాయుడు, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, కూండ్రపు మధు, వియ్యపు చిన్న, ఎం.ఎం.నాయుడు తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ముత్యమాంబ అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు అందించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన జరిపారు. బాణసంచా వెలుగుల నడుమ అమ్మవారి అనుపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. భర్నికం పరదేశిమాంబ అమ్మవారి అనుపోత్సవాన్ని ఆ గ్రామ ప్రజలు వేడుకగా జరిపారు.



ముత్యమాంబను దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

ఆత్మకూరికి ఘన నివాళి



ఆస్పత్రి ఆవరణలోని ఆత్మకూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకుమార్, తదితరులు

సింహాచలం: శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వ్యవస్థాపకుడు ఆత్మకూరి శంకరరావు 13వ వర్ధంతిని ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించారు. శంకరరావు విగ్రహానికి ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ కృష్ణకుమార్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆస్పత్రి జీఎం కె.రాధాకృష్ణన్, వైద్యులు రవీంద్ర, ప్రొఫెసర్ కృష్ణప్రసాద్, నస్రిన్, కృష్ణ, అజయ్‌శర్మ, చల్లా, శిరీష, గౌరవ సహాలహాదారు టి.సత్యనారాయణ, డీజీఎం కె.బంగార్రాజు, ఏజీఎం ఎస్.కె.ఎల్.రావు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బూడిద, బొగ్గు లారీలు సమయపాలన పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

పరవాడ: హిందూజా, ఎన్టీపీసీ పరిశ్రమల బూడిద చెరువుల నుంచి బూడిద, బొగ్గును రవాణా చేస్తున్న లారీ యాజమాన్యాలు సమయపాలన పాటించాలని పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 7.30 నుంచి 9.30 వరకు సాయంత్రం 5 నుంచి 7.30 వరకు నిర్దిష్ట సమయాలను పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ బి.కృష్ణారావు పాల్గొన్నారు.

వైభవం.. పోలిపిల్లమ్మ సంబరం



అమ్మవారి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, తదితరులు



అనుపు ఉత్సవంలో ఆకట్టుకున్న శక్తి వేషాలు

- అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సింహాచలం: 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో కొలువైన పోలిపిల్లమ్మ వార్షిక పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు అప్పన్నపాలెం, సింహపురికాలనీ, సింహపురి లేఅవుట్, వేపగుంట, అడవివరం, పద్మావతినగర్, షిప్‌యార్డు కాలనీ, చాకిరేవుకొండ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పెద్దఎత్తున అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు, గాజులు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పులిహోర, చక్కెరపొంగలి ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని అత్యంత ఘనంగా జరిపారు. భారీ ఊరేగింపు నిర్వహించారు. తాడేపల్లిగూడేనికి చెందిన శక్తి వేషాలు, విశాఖకు చెందిన కేరళ డ్రమ్స్ వాయిద్యాలు, కోలాటం విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పంచదార్ల సోమినాయుడు, ఉపాధ్యక్షుడు కంచుబోయిన సింహాద్రి, కార్యదర్శి సతీష్, క్యాషియర్ ఈశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పండగలో భాగంగా మంగళవారం రాత్రి పెద్దఎత్తున ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. వైఎస్సార్‌సీపీ 98వ వార్డు మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు పీతల విష్ణుమూర్తి, పీతల శివగణేష్ ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ విశేషంగా అలరించింది. గ్రామస్తులు సారిపిల్లి నరసింహమూర్తి, ఉరివిటి ఈశ్వరరావు, నోళ్ల అప్పలరాజు, కె.సోమినాయుడు తదితరులు ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెందుర్తి పోలీసులు భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న అదీప్‌రాజ్

అమ్మవారిని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. ఆయన పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు పీతల బ్రదర్స్ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల వేదికపై మాట్లాడుతూ గ్రామస్తులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్‌ను పీతల బ్రదర్స్ దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ నాయకులు పీతల అప్పలరాజు, పీతల విష్ణుమూర్తి, నడింపల్లి రామరాజు, బల్ల రాంబాబు, సూరిశెట్టి సూరిబాబు, చందూ యాదవ్, చిరికి దేముడు, కానూరి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై ఘనంగా శ్రీనృసింహ హోమం



కుంభప్రోక్షణలో అర్చకులు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం ఘనంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు జరిపారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద వేంజేపచేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

పండగల్లో జూదమాడితే కఠిన చర్యలు

- పెందుర్తి సీఐ సతీష్‌కుమార్ హెచ్చరిక



జూదం నిషేధంపై ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న సీఐ సతీష్‌కుమార్, పోలీసులు

పెందుర్తి: గ్రామాల్లో అమ్మవారి పండగలు, ఇతర కార్యక్రమాలు, వారాంతాల్లో పేకాట, కోడిపందాలు, గుండాట వంటి తదితర జూదం ఆడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ హెచ్చరించారు. జూదం నిషేధంపై రూపొందించిన ఫ్లెక్సీని స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం సీఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పూర్తిగా జూదాన్ని నిషేధించామన్నారు. పండగల్లో అశ్లీల నృత్యాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కూడా నిషిద్ధమన్నారు. అమ్మవార్ల పండగలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఎస్ఐ స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

పరవాడ/సబ్బవరం: పరవాడ, సబ్బవరం మండలాల పరిధిలోని రేషన్ కార్డుదారులందరు ఈ నెల 31లోగా ఆధార్ ఈకేవైసీ నమోదు చేసుకోవాలని తహసీల్దార్లు ఎస్వీ అంబేడ్కర్, బి.చిన్నికృష్ణ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. రేషన్ కార్డులో లబ్ధిదారులైన ఐదేళ్ల పైబడి 60 ఏళ్లలోపు వయసున్న వారందరూ సమీపంలోని రేషన్ డిపో డీలర్ వద్దకు వెళ్లి తమ ఆధార్‌తో ఈకేవైసీని నమోదు చేయించుకోవాల్సిందిగా సూచించారు. ఈకేవైసీ నమోదు చేయించకపోతే ఏప్రిల్ నెల రేషన్ సరకుల సరఫరా నిలిచిపోతుందన్నారు. రేషన్ కార్డుదాలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివరాలతో ఈకేవైసీ పూర్తి చేసుకోవాల్సిందిగా కోరారు.

నేర విచారణలో ప్రతి ఆధారం విలువైనదే..

- డీఎస్ఎన్ఎల్‌యూలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ జాతీయ పోటీలు



ప్రారంభోత్సవంలో రామకృష్ణారావు, తదితరులు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ 6వ జాతీయ స్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాఖ పోలీస్ కమిషనరేట్ న్యాయ సలహాదారు రామకృష్ణారావు మాట్లాడుతూ విచారణ దశలో నేరం జరిగిన ప్రదేశం, అక్కడ దొరికే ప్రతి చిన్న ఆధారం ఎంతో విలువైనన్నారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నేర పరిశోధనల్లో చిక్కుముడులను వివరిస్తూ, కేసు వాదన సమయంలో న్యాయవాది పోలీస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా కూడా మారాలన్నారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ మాట్లాడుతూ దర్యాప్తు అధికారులుగా ఎదుర్కొంటున్న సవాళ్లను విద్యార్థులతో పంచుకున్నారు. ఢిల్లీ ఆరుషి ప్రధాన్ కేసును ఉదహరిస్తూ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో సీపీ డాక్టర్ నందిని, అధ్యాపకులు సీహెచ్ లక్ష్మి, రిఫాత్ ఖాన్, రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మదాసు, విద్యార్థి కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com